క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



ప్రసన్నకు పూలమొక్కను అందజేస్తున్న నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం: కోవూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నేతలు మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడిగా నియమితులైన పిడుగు మధు, మహిళా విభాగం అధ్యక్షురాలు మోర్ల జయంతి, బుచ్చి నగర పంచాయతీ అధ్యక్షుడు షేక్. షాహుల్‌తోపాటు స్థానిక కౌన్సిలర్లు ప్రమీలమ్మ, యానాదిరెడ్డి, షకీల, అనంతమ్మ, పార్టీ రూరల్ అధ్యక్షుడు చెర్లో సతీష్‌రెడ్డి, రాయుడులు ప్రసన్నను కలిసి పూల మొక్కను అందించి కృతజ్ఞతలు తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

పొదలకూరు: వీఎస్‌యూ డిగ్రీ ఫలితాల్లో పట్టణంలోని విజ్ఞాన్ కాలేజీ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఫైనలియర్ ఐదో సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో మండల ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించారు. బీఎస్సీ గ్రూపులో షేక్ బేబీ 9.86 జీపీఏతో ప్రథమ స్థానంలో, పఠాన్ రోమిదాభాను 9.84 జీపీఏతో ద్వితీయ స్థానంలో నిలిచారు. బీకామ్ గ్రూపులో సరిగిరి వైష్ణవి 9.42 జీపీఏతో కాలేజీ ఫస్ట్‌గా, మండలంలో రెండో స్థానంలో రాగా, బోయిన అభినయ 9.14 జీపీఏతో కాలేజీ సెకండ్‌గా నిలిచింది. బీఎస్సీలో బొమ్మి శ్రావణి 9.01 జీపీఏతో కళాశాలలో తృతీయ స్థానం కైవశం చేసుకుంది. ఈ సందర్భంగా కాలేజీ యాజమాన్యం బుధవారం విద్యార్థులను అభినందించింది. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జి.నారాయణరెడ్డి, జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ ఎ.సుబ్బారావు, ఇన్‌చార్జ్ సీహెచ్ కృష్ణ, వైస్ ప్రిన్స్‌పల్ ఎ.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాల పట్టివేత

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని ముంబై జాతీయ రహదారి పాటూరు క్రాస్‌రోడ్డు వద్ద రెండు వాహనాల్లో చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా పట్టుకున్నట్లు సీఐ శ్రీనివాసులురెడ్డి బుధవారం తెలిపారు. స్థానికుల సమాచారంతో ఎస్సై సంతోష్‌రెడ్డి ఓ వాహనాన్ని సీజ్ చేయగా మరో వాహనాన్ని తమ సిబ్బంది స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. వ్యర్థాలను పెన్నానదిలో పూడ్చినట్లు తెలిపారు. డ్రైవర్లను అరెస్ట్ చేశామన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పొదలకూరు: పట్టణంలో వివిధ ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీకాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీచర్స్ కాలనీ, రామ మందిరం, గేట్‌సెంటర్, బుడేసాహేబ్, తొగట, అగచాట్లపురం, ఏసీ కాలనీ, మారుతీనగర్, లింగంపల్లి వీధుల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

హైరిస్క్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి



పీహెచ్‌సీని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ సుజాత

ఇందుకూరుపేట: ఇటుక బట్టీలు, రొయ్యలు, చేపల చెరువులు, ఆక్వాకు సంబంధించిన పరిశ్రమలు తదితర హైరిస్క్ ఏరియాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత ఆదేశించారు. మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైరిస్క్ ఏరియాల్లో ఉంటున్న ప్రజలకు వ్యాక్సిన్‌లు, వైద్య సేవలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కిశోర్‌కుమార్, బ్రహ్మేశ్వరనాయుడు, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, సూపర్‌వైజర్ సతీష్‌బాబు, ఫార్మసిస్ట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ఆధార్ తప్పనిసరి



మేయర్‌ను సత్కరించిన అధికారులు

ఇందుకూరుపేట: సంక్షేమ పథకాలు పొందాలంటే ఆధార్ తప్పనిసరి అని నెల్లూరు మేయర్ స్రవంతి తెలిపారు. మండలంలోని కొరుటూరులో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పౌరుడు విధిగా ఆధార్ కార్డు తీసుకోవాలన్నారు. స్థానిక ఎంపీటీసీ స్వర్ణా శ్రీనివాసులురెడ్డి, ఐటీడీఏ అధికారులు పాల్గొన్నారు.

వరికి తెగుళ్ల బెడద

- అగ్గి, కుళ్లు తెగళ్లతో విలవిల
- ఆందోళనలో అన్నదాతలు
- సుమారు 14 వేల ఎకరాల్లో రబీ సాగు



వరిగొండ ప్రాంతంలో అగ్గి తెగులు సోకిన వరి పైరు

తోటపల్లిగూడూరు: రబీ సీజన్‌లో సాగు చేసిన వరి పంట అగ్గి, కుళ్ల తెగుళ్ల బారిన పడింది. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని కోడూరు, వరిగొండ, మాచర్లవారిపాళెం కాలువల ఆయుకట్టు పరిధిలో అధికారికంగా 9 వేల ఎకరాలు, అనధికారికంగా మరో 5 వేల ఎకరాల్లో ప్రస్తుతం మొదట పంట సాగులో ఉంది. అధిక శాతం రైతులు నెల్లూరు పెద్ద జిలకర్లు, బీపీటీ 5205 రకాలను సాగుచేస్తున్నారు. ప్రస్తుతం వరిపైరు లేత పొట్ట, వెన్ను దశలో ఉంది.

వాతావరణం అనుకూలించక..

ప్రస్తుతం వాతావరణం సాగుకు అనుకూలంగా లేదు. పగటి ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నాయి. రాత్రి పొగమంచు కురుస్తోంది. ఈ నేపథ్యంలో వరికి తెగుళ్ల బెడద అధికమైంది. సుమారు 500 ఎకరాల్లో అగ్గి, కుళ్ల తెగుళ్ల ఉధృతంగా ఉన్నట్లు తెలిస్తోంది. ఏపుగా పెరుగుతున్న వరి పైరు ఎర్రగా మారి కుచించుకుపోతోంది. వ్యవసాయాధికారులు సూచించిన మందులను పిచికారీ చేస్తున్నా ఆశించిన స్థాయిలో ప్రయోజనం ఉండటం లేదని రైతులు వాపోతున్నారు. మందులు వాడిన తర్వాత అగ్గితెగులు కాస్త అదుపులోకి వస్తున్నా కుళ్ల తెగులు మాత్రం పంటను దెబ్బతీస్తోంది. అధికంగా పెట్టుబడులు పెట్టి సాగు చేస్తున్న రైతులు ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులతో ఆందోళన చెందుతున్నారు. వ్యవసాధికారులు స్పందించాలని, తీవ్రంగా నష్టపోతామని అన్నదాతలు చెబుతున్నారు.

ప్రయోజనం లేదు



నాలుగు ఎకరాల్లో పెద్ద జిలకర్లు సాగు చేస్తున్నా. ప్రస్తుతం పైరు లేత పొట్ట దశలో ఉంది. ఏపుగా పెరుగుతున్న పైరుకు వారం రోజుల క్రితం అగ్గి తెగులు సోకింది. ఈ నేపథ్యంలో వ్యవసాయాధికారుల సూచనలతో అనేక రకాల మందులు పిచికారీ చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ రబీలో తీవ్రంగా పంట నష్టం వాటిల్లే పరిస్థితి ఉన్నట్లు అర్థమవుతోంది.

– శేఖర్‌రెడ్డి, రైతు, వరిగొండ

నిర్లక్ష్యం వహిస్తే నష్టం తప్పదు

వరికి సోకే అగ్గితెగుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే నష్టం తప్పదు. రైతులు సరైన అవగాహనతో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలి.

– రాజ్‌కుమార్, ఏడీఏ, ఇందుకూరుపేట డివిజన్



అగ్గి తెగుల నివారణకు మందును పిచికారీ చేస్తున్న రైతు

పలువురికి ప్రసన్న పరామర్శ



కొండమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రసన్న

విడవలూరు: మండలంలోని దంపూరు గ్రామంలో అనారోగ్యంతో మృతిచెందిన పసుమర్తి రామసుబ్బమ్మ పెద్దకర్మలో బుధవారం మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొని కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేలా గాదెలదిన్నె గ్రామంలో జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల లక్ష్మయ్య సోదరి గల్లా మస్తానమ్మ పెద్దకర్మలో పాల్గొని ఆమె చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం రామతీర్థంలో పొన్నాడి చంద్రశేఖర్ తల్లి అన్నమ్మ పెద్దకర్మలో పాల్గొని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఊటుకూరులో కోమిట్ల రమణారెడ్డి సతీమణి కొండమ్మ పెద్దకర్మలో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆప్కాఫ్ మాజీ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు అనపల్లి ఉదయ్‌భాస్కర్, దంపూరు నాయకులు నాగొళ్ల శ్రీనివాసులు, శివరామిరెడ్డి, తలారి ప్రభాకర్, మానికల శ్రీను, పరుసు శివప్రసాద్, మాలాలి, పరుసు సుబ్బారావు, గాదెలదిన్నె నాయకులు గల్లా శివయ్య, భాస్కర్, కోటేశ్వరరావు, సుధాకర్, హరిబాబు, రామతీర్థం నాయకులు నెల్లూరు చెంచురత్నం, నాటారు చంద్రయ్య, బుచ్చింగారి తిరుపతయ్య, నువ్వూరు నరేష్, ఎన్.పోలిరెడ్డి, నెల్లూరు పోలిరెడ్డి, కృష్ణారెడ్డి, సాగర్‌రెడ్డి, వేనాటి ప్రసాద్ ఉన్నారు.

ఆలయాల్లో మాఘ పౌర్ణమి పూజలు



పొదలకూరులో..



వెంకటేశ్వర స్వామికి పూజలు

పొదలకూరు: మాఘ పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని వెంకయ్యస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామికి బుధవారం తిరుమంజన వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆలయానికి స్వామి, అమ్మవార్ల విగ్రహాలను నున్నా మల్లికార్జున్ – భానులోకప్రియ, శ్రీనివాస కృష్ణమోహన్ – ఉమామహేశ్వరి, నవీన్ – శ్రావణి దంపతులు బహూకరించారు. ప్రత్యేక అభిషేకం చేశారు. ఇంకా శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజల్ని నిర్వహించారు. మూలవిరాట్‌కు అభిషేకం జరిగింది.

రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



బహుమతి అందుకుంటున్న రూపాళి

పొదలకూరు: రాష్ట్ర స్థాయి జూనియర్ అబాకస్ పోటీల్లో పొదలకూరు విద్యార్థిని ప్రథమ స్థానంలో నిలిచింది. పట్టణంలోని నాగార్జున స్కూల్లో రెండో తరగతి చదువుతున్న కాకులూరు రూపాళి ఈనెల 2వ తేదీన విశ్వం ఎడ్యుటెక్ జిల్లా స్థాయిలో నిర్వహించిన అబాకస్ పోటీల్లో జోనల్ స్థాయిలో విజయం సాధించింది. తర్వాత రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపినట్లుగా కరస్పాడెంట్ బి.సునీతారెడ్డి బుధవారం వెల్లడించారు. రూపాళిని స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్ లక్ష్మీదుర్గా తదితరులు అభినందించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



డ్రైవర్‌తో మాట్లాడుతున్న ఎస్సై

పొదలకూరు: ఆటోలను డ్రైవర్లు అడ్డదిడ్డంగా నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎస్‌కే హనీఫ్ హెచ్చరించారు. పట్టణంలోని పంచాయతీ బస్టాండ్‌లో బుధవారం ఆటో డ్రైవర్లతో మాట్లాడారు. నిబంధనలను పాటిస్తూ వాహనాలను నడపాలని సూచించారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించొద్దన్నారు. టౌన్‌లో రోడ్లపై అడ్డగోలుగా నిలిపి ఇష్టానుసారం ప్రవర్తిస్తే జరిమానాలు విధిస్తామన్నారు. అయినా మారకపోతే కేసులు కూడా పెట్టడం జరుగుతుందన్నారు.

టీబీ వ్యాక్సిన్‌ను వేసుకోవాలి

- జిల్లా క్షయ నివారణాధికారి ఖాదర్‌వలీ



సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వలీ

పొదలకూరు: అడల్ట్ టీబీ వ్యాక్సిన్‌ను ప్రతి ఒక్కరూ వేసుకోవాలని జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ పేర్కొన్నారు. స్థానిక సీహెచ్‌సీలో టీబీ పరీక్షలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీసీ వ్యాక్సిన్‌పై సర్వే నిర్వహించి వేయాల్సిందిగా వెల్లడించారు. గ్రామాల్లో డయేరియా ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ల్యాబ్ టెక్నీషియన్‌కు పలు సూచనలిచ్చారు. ఆయన వెంట సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ యు.ప్రసాద్, సిబ్బంది ఉన్నారు. అనంతరం ఖాదర్‌వలీ ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాన్ని పరిశీలించారు. టీబీ అనుమానిత కేసులను పరీక్షలకు పంపాల్సిందిగా సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట డాక్టర్ కావ్యశ్రీ, వైద్య సిబ్బంది ఉన్నారు.

వెంకటాచలం విద్యార్థి సత్తా



హరికృష్ణ

వెంకటాచలం: జేఈఈ మెయిన్స్‌లో వెంకటాచలం గ్రామానికి చెందిన విద్యార్థి సండి హరికృష్ణ ప్రతిభ చూపాడు. మండలంలోని సరస్వతీనగర్ వద్దనున్న రవీంద్ర భారతిలో చదివిన హరికృష్ణ ఫిజిక్స్‌లో 88.57, కెమిస్ట్రీలో 86.47, మ్యాథ్స్‌లో 98.66 శాతం.. మొత్తంగా 94.14 పర్సంటైల్ సాధించాడు.

డిగ్రీ పరీక్షలకు నలుగురు విద్యార్థుల గైర్హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో బుధవారం నిర్వహించిన డిగ్రీ మూడు, ఆరో సెమిస్టర్ మెగా సప్లిమెంటరీ పరీక్షలకు నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు తెలిపారు. 133 మందికి గానూ 129 మంది హాజరయ్యారని వెల్లడించారు.

రైతులను ఆదుకోవాలి

- బీజేపీ నాయకుడు శ్రీనివాసులు

మనుబోలు: రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించి వారిని ఆదుకోవాలని బీజేపీ జిల్లా నేత బోలా శ్రీనివాసులు కోరారు. బుధవారం ఆయన మండలంలోని కాగితాలపూరు గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. రైతులు ఇప్పటికే పరిమితికి మించి పెట్టుబడులు పెట్టారని వెల్లడించారు. గతేడాదితో పోలిస్తే ప్రస్తుతం ధాన్యం ధరలు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. ఈ నెలాఖరుకు మండలంలో వరికోతలు ప్రారంభమవుతాయని ఈలోగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు ధాన్యం కొనుగోలు సమయంలో విధించిన నిబంధనలను సరళతరం చేయాలని కోరారు.

రెచ్చిపోతున్న మట్టి మాఫియా



గ్రామంలో పట్టపగలే మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

విడవలూరు: కోవూరు నియోజకవర్గంలో మట్టి మాఫియా రోజురోజుకు రెచ్చిపోతోంది. మండలంలోని ముదివర్తి గ్రామానికి చెందిన టీడీపీ ముస్లిం మైనారిటీ నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి స్థానిక హరిజనవాడ సమీపంలో శివాయి భూముల్లో వారంరోజుల నుంచి మట్టి అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. వారు పోటాపోటీగా పట్టపగలే కోవూరు మండలంలోని ఇటుక బట్టీలకు మట్టిని తరలిస్తూ రెండు మండలాల అధికారులకు సవాల్ విసురుతున్నారు. ఈ తంతు వెనుక ఓ సీనియర్ టీడీపీ నాయకుడి హస్తం ఉండటంతో అధికారులు మౌనంగా ఉన్నారనే విమర్శలున్నాయి. గతంలోనూ ఎన్నోసార్లు ఈ వ్యక్తులే అక్రమంగా ఇసుకను తరలిస్తూ పట్టుబడి, రాజకీయ పలుకుబడితో గుట్టుచప్పుడు కాకుండా వాహనాలను విడిపించుకున్నారు.

16న పొదలకూరులో సమావేశం



కరపత్రాలను చూపుతున్న నాయకులు

పొదలకూరు: పొదలకూరు పట్టణంలో ఆదివారం నిర్వహించే పద్మశాలీల సమావేశాన్ని విజయవంతం చేయాలని అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీహెచ్ చినసుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. జన సమీకరణ కోసం బుధవారం మండలంలోని మరుపూరు, బిరదవోలు, ముత్యాలపేట, వెంకటాచలం మండలం కసుమూరు, కురిచెర్లపాడు గ్రామాల్లో పర్యటించారు. కార్యక్రమంలో మాటా రాధాకృష్ణయ్య, చొప్పా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వీఎస్‌యూలో అంబులెన్స్ ప్రారంభం



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి వీసీ

వెంకటాచలం: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఎస్‌ఆర్ నిధుల ద్వారా మంజూరు చేసిన అంబులెన్స్‌ను మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో బుధవారం ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు, ఆ బ్యాంక్ రీజినల్ హెడ్ ఎ.రాజశేఖరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ వీఎస్‌యూ ఉద్యోగులు, విద్యార్థుల కోసం అంబులెన్స్‌ను కేటాయించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు చర్యలు



క్యాప్చర్ యూనిట్ ప్లాంట్

ముత్తుకూరు: దేశంలో అతిపెద్ద స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తిదారుల్లో ఒకటైన స్థానిక ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకుంది. సంచలనాత్మక కార్బన్ క్యాప్చర్ టెక్నాలజీని అభివృద్ధి చేయడానికి ఐఐటీ మద్రాస్‌తో చేతులు కలిపింది. ఈ వినూత్న ప్రాజెక్ట్ కార్బన్ క్యాప్చర్ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచే పేటెంట్ కలిగి కీమోజెల్ అనే నానోపార్టికల్ ఆధారిత ద్రావకాన్ని ఇప్పటికే సృష్టించింది. ఇప్పుడు క్షేత్రస్థాయిలో కీమోజెల్ పనితీరును పరీక్షించేందుకు ఒక పైలట్ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టింది. ఈ విప్లవాత్మక పరిశోధనకు మద్దతుగా ఎస్‌ఈఐఎల్ తన కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా రూ.71 లక్షల నిధులను సమకూర్చుతోంది. ఈ సందర్భంగా కంపెనీ సీఈఓ రాఘవ్ త్రివేది బుధవారం మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్ ఐఐటీ మద్రాస్‌తో భాగస్వామి కావడం గర్వకారణంగా ఉందన్నారు. ఈ సాంకేతికతను తదుపరి స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

పారదర్శకంగా రీసర్వే : జేసీ



మాట్లాడుతున్న జేసీ కార్తీక్

కోవూరు: కోవూరు పంచాయతీలో తొలి విడతగా చేసే రీసర్వేను పారదర్శకంగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అన్నారు. కోవూరు గుమళ్లదిబ్బలో జరుగుతున్న రీసర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు పూర్తి సమాచారం ఇచ్చి రీసర్వే చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నిర్మలానందబాబా, రీసర్వే డీటీ మధుసూదన్‌రావు, సర్వేయర్ రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య



కొడవలూరు : నార్తురాజుపాళెంలో పొలం పిలుస్తోందిలో పాల్గొన్న అధికారులు, రైతులు



పొదలకూరు: రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ



ఇందుకూరుపేట : రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు

పొదలకూరు: రైతులకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేయవచ్చని పొదలకూరు సహాయ వ్యవసాయ సంచాలకుడు కె.శివనాయక్ పేర్కొన్నారు. పొదలకూరు పంచాయతీ చిట్టేపల్లి గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందేందుకు ఈ సంఖ్య పని చేస్తుందన్నారు. నమోదు చేసుకునేందుకు రైతు సేవా కేంద్రానికి వెళ్లాలని సూచించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

కొడవలూరు : ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయాలకు పంట నమోదు తప్పనిసరి అని కోవూరు ఏడీఏ డి.సుజాత సూచించారు. మండలంలోని నార్తురాజుపాళెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సొంత పొలమున్న వారు విధిగా రైతు విశిష్ట నంబర్‌కు నమోదు చేసుకోవాలన్నారు. ఇందుకోసం రైతులు వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు. విశిష్ట నంబర్ కలిగిన రైతులకే ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఓ లక్ష్మి, ఏఈఓ పి.వెంకట్రావు, వీఏఏ డి.శివజ్ఞాన పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో..

విడవలూరు: మండలంలోని ఊటుకూరు, పెద్దపాళెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఏఓ పి.వెంకటకృష్ణయ్య పలు సూచనలు చేశారు. రైతులు తప్పకుండా విశిష్ట నంబర్ కోసం నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఈఓ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

ఇందుకూరుపేట: ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను చేయించుకోవాలని ఏడీఏ రాజ్‌కుమార్ సూచించారు. మండలంలోని ఇందుకూరుపేట రైతు సేవా కేంద్రంలో జరిగిన రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. వీఏఏ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.